క్లుప్తంగా

నేడు బీసీ కమిషన్ బహిరంగ విచారణ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీ కమిషన్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాల్లో బహిరంగ విచారణ చేపట్టనుంది. సామాజిక, విద్య, వెనుకబడిన తరగతుల పరిస్థితులను తెలుసుకోవడానికి ఈ విచారణ చేపట్టనున్నారు. తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు జయప్రకాష్, సురేందర్, బాలలక్ష్మిలు రానున్నారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి, నారాయణపేట జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు బీసీ సంఘాలు, సంచార జాతులు, ప్రజలు, బీసీ వర్గాలు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో అవసరమైన రిజర్వేషన్లు, దామాషాపై అభిప్రాయాలు తెలియజేయవచ్చు. ఉదయం 10 గంటల మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాలు, ఉదయం 11 గంటలకు వనపర్తి జిల్లా, మధ్యాహ్నం 12 గంటలకు గద్వాల జిల్లా, మధ్యాహ్నం 2 గంటలకు నారాయణపేట జిల్లా, మధ్యాహ్నం 3 గంటలకు ఆయా జిల్లాలకు చెందిన వారి అభిప్రాయాలు తెలియజేయవచ్చు.

పుస్తకాన్ని ఆవిష్కరించిన పీయూ వీసీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ ఎకానామిక్స్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు రాఘవేందర్ రచించిన వ్యవసాయంలో కృత్రిమ మేధా అనుసంధానం చేయడం ద్వారా ఖర్చులు తగ్గి అధిక దిగుబడులు పొందవచ్చు అనే అంశంపై రచించిన పుస్తకాన్ని వీసీ జీఎన్ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన రచయితను అభినందించారు. అధ్యాపకుల నుంచి మరిన్ని పుస్తకాలు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వీసీ ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, అంకం భాస్కర్, జిమ్మి కార్టన్, ప్రిన్సిపల్ చంద్రకిరణ్, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

3,010 ఇళ్లలో కుటుంబ సర్వే



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో గురువారం 3,010 ఇళ్ల వద్దకు ఎన్యుమరేటర్లు వెళ్లి ఆయా కుటుంబ యజమానుల నుంచి పూర్తి సమాచారం సేకరించారు. మొత్తం 49 వార్డులలోని 78,696 ఇళ్లకు గాను, ఇప్పటి వరకు 51,621 ఇళ్లకు సంబంధించిన వివరాలను నమోదు చేశారు.

అన్నదాన సత్రానికి భూమి పూజ



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని సంకల్పసిద్ధి హరిహర అయ్యప్ప క్షేత్రం వద్ద అన్నదాన సత్రం నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. దాతల సాయంతో అయ్యప్ప ఆలయ నిర్మాణం పూర్తి కాగా, ఆలయం పక్కనే దాతల సాయంతో అన్నదాన సత్రం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆలయాభివృద్ధికి దాతలు సహకరించాలని ఆలయ నిర్వాహకులు కోరారు. అన్నదాన సత్రం నిర్మాణానికి సుమారు రూ.10లక్షల వ్యయం కానున్నందున దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు తిరుపతయ్యగౌడ్, కొంగరి శ్రీనివాసులు, భాస్కర్‌గౌడ్, విశ్వేశ్వర్, చందర్, సతీష్, యాదయ్య శెట్టి, కొండయ్య, నారాయణ, మహేందర్, కృష్ణ, పల్లె జగన్, రాజు, భీమయ్య ఉన్నారు.

జాతీయ గోగేమ్‌లో విద్యార్థుల ప్రతిభ



మహబూబ్‌నగర్ క్రీడలు: మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి సీనియర్, సబ్ జూనియర్ గోగేమ్ పోటీల్లో జిల్లా కేంద్రం రాజేంద్రనగర్‌లోని న్యూరిషి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపల్ వెంకటరమణ తెలిపారు. ఈ పోటీల్లో 8వ తరగతికి చెందిన చేతన్‌చంద్ర, రాజేష్ బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ చంద్రకళ వెంకటయ్య, డైరెక్టర్లు పూజిత మోహన్‌రెడ్డి, శిరీష ప్రవీణ్‌కుమార్, సాయి సుశాంత్‌కృష్ణ, పీఈటీ విష్ణుకాంత్‌గౌడ్, ఉపాధ్యాయులు అభినందించారు. రాబోయే రోజుల్లో విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయస్థాయిల్లో రాణించాలని ఆకాంక్షించారు.

మేధాశక్తిని పెంచేందుకే పోటీలు

- జిల్లావ్యాప్తంగా మండలస్థాయి చెక్‌ముకి పోటీలు
- విజేతలకు బహుమతుల ప్రదానం
- తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో జిల్లా స్థాయికి ఎంపిక



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన మౌంట్‌బాసిల్ విద్యార్థులను అభినందిస్తున్న అకాడమిక్ మానిటరింగ్ అధికారి దుంకుడు శ్రీనివాస్, తదితరులు

సాక్షి, నెట్‌వర్క్: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ దుంకుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఏవీఎం ఫంక్షన్ హాల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థుల ఆలోచన ధోరణి సైన్స్, వాస్తవికతకు దగ్గరగా ఉండే విధంగా వారిని తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్, రూరల్ ఎంఈఓ కృష్ణయ్య, సైబర్ క్రైం ఎస్ఐ శ్రవణ్‌కుమార్ జేవీవీ కార్యదర్శి వెంకటస్వామి, ఉపాధ్యక్షుడు అశోక్‌గౌడ్, ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

- జడ్చర్ల పట్టణంలోని బాదేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. హైస్కూల్ హెచ్ఎం చంద్రకళ, బాలికల హైస్కూల్ హెచ్ఎం లక్ష్మిలు మాట్లాడారు.
- మిడ్జిల్‌లోని ఉన్నత పాఠశాలలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. 28న జడ్చర్లలో నిర్వహించే టాలెంట్ పరీక్షకు తెలుగు మీడియం, ఇంగ్లిష్ మీడియం నుంచి విద్యార్థులు ఎంపికైనట్లు నిర్వాహకులు వెంకటయ్య తెలిపారు.
- దేవరకద్రలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో చెకుముకి సైన్స్ పోటీలు నిర్వహించారు. తపోవన్ ఉన్నత పాఠశాల నుంచి సాయి ప్రణవి, కరుణశ్రీ, వికాస్‌రెడ్డిలుజిల్లా స్థాయికి ఎంపికయ్యారు.
- రాజాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు రంగారెడ్డి ఉన్నత పాఠశాల, కేజీబీవీ విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు.
- అడ్డాకుల మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద చెకుముకి పోటీల్లో అడ్డాకుల, కందూర్, పొన్నకల్, రాచాల, శాఖా పూర్, కన్మనూర్‌కు చెందిన 27 మంది విద్యార్థులు హాజరయ్యారు.
- చిన్నచింతకుంట, ఉంద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలవిద్యార్థులు చెక్‌ముకి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు.

జిల్లాస్థాయి మౌంట్‌బాసిల్ విద్యార్థుల ఎంపిక

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ఆర్వీఎం సమావేశ మందిరంలో నిర్వహించిన మండలస్థాయి చెకుముకి పోటీల్లో మౌంట్‌బాసిల్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ మేరకు సి.శ్రీచైత్రిక (8వ తరగతి), జి.పరిమళ (9వ తరగతి), ఎన్.సాయిశ్రీచరణ్ (10వ తరగతి) ఎంపికయ్యారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి చెకుముకి పోటీలు ఎంతో దోహదపడతాయని అకాడమిక్ మానిటరింగ్ అధికారి దుంకుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. పాఠశాలస్థాయిలో విద్యార్థుల ప్రతిభ గుర్తించేందుకే టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల చైర్మన్ చంద్రకళావెంకటయ్య, డైరెక్టర్లు శిరీష ప్రవీణ్, పూజిత మోహన్‌రెడ్డి, సుశాంత్ కృష్ణ,ప్రిన్సిపల్ సోమశేఖర్ అభినందించారు.



జడ్చర్లలో మాట్లాడుతున్న చంద్రకళ



మిడ్జిల్‌లో..



దేవరకద్రలో..

మత్స్యకారుల అభివృద్ధికి కృషి



తెలంగాణ చౌరస్తాలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ సంబరాలు నిర్వహిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మత్స్యకారుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, వృత్తిపై ఆధారపడిన మత్స్యకారులకు ప్రభుత్వం ప్రోత్సాహాన్నిస్తుందని మహబూబ్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల పరిధిలోని చెరువులు, కుంటలకు వందశాతం సబ్సిడీపై చేప పిల్లలు పంపిణీ చేస్తుందన్నారు. సబ్సిడీపై వలలు, పనిముట్లు, బాక్సులు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో మైత్రి యాదయ్య, గోనెల శ్రీనివాసులు, గంజి అంజనేయులు, గుగ్గిళ్ల కుర్మయ్య, నిరంజన్, రామకృష్ణ, దోమపరమేశ్, మేకల శివ, రామకృష్ణ పాల్గొన్నారు.

- ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని కలెక్టరేట్‌లోని మత్స్యశాఖ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షులు, మత్స్యశాఖ కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రతి మత్స్యకా రుడు సద్వినియోగం చేసుకోవాలని వేపూరు మ త్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు రాంచంద్రయ్య తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ మదన్‌మోహన్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాజెక్టుఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ఎందుకు పూర్తి చేయలేదో అప్పుడు ఇరిగేషన్‌శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు ఈ ప్రాంత ప్రజలకు సమాధానం చెప్పాలని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. 2015లో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి ఇక్కడే కుర్చీ వేసి కూర్చొని మూడేళ్లలో పూర్తిచేస్తానన్న కేసీఆర్ ఈ ప్రాంత ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు తర్వాత శంకుస్థాపన చేసిన కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లా ఎమ్మెల్యేలు అడిగింది తడువుగా వెంటనే పనులను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, డీసీసీ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్ పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో వారం రోజుల పాటు నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, కార్యదర్శి మనోజ్‌కుమార్, హర్షవర్ధన్‌రెడ్డి, సిరాజ్‌ఖాద్రీ, నవీన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వెల్ఫేర్ బోర్డును కొనసాగించాలి

- సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని ఈ నెల 26న మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్ తెలిపారు. గురువారం తెలంగాణ భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మికుల రౌండ్ టేబుల్ సమావేశాన్ని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు ఎన్నో ఏళ్లుగా చేసిన పోరాటాల ఫలితంగా ఏర్పడిన భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును నిర్వీర్యం చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెల్ఫేర్ బోర్డు నిధులను ప్రైవేటు బీమా సంస్థలకు ఇవ్వాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జాతీయ నాయకులు గోలీల రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరద గాలెన్న, నాయకులు తిర్మలయ్య, వెంకటయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర నాయకులు కిల్లెగోపాల్

మహిళ అదృశ్యం

భూత్పూర్: మండలంలోని ఎల్కిచర్ల గ్రామంలో మహిళ అదృశ్యం కావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. గ్రామానికి చెందిన గొల్ల నారమ్మ(46) ఈ నెల 16న రాత్రి ఇంట్లో అందరు నిద్రిస్తున్న సమయంలో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. 17న ఉదయం లేచి చూడగా నారమ్మ కనిపించలేదు. 4 రోజులు పాటు గ్రామంలో, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం ఆమె కుమారుడు గొల్ల భరత్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠశాలల్లో ఎంఈఓ తనిఖీ



దేవరకద్ర: మండలంలోని పలు పాఠశాలలను గురువారం ఎంఈఓ బలరాం ఆకస్మిక తనిఖీ చేశారు. మండలంలోని దాడితండాలో విద్యార్థులతో పాటు ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. నాగారంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల విద్యా బోధన పరిశీలించారు. మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అదించాలన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

హన్వాడ: మండలంలోని చిన్నదర్పల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మధ్యాహ్న భోజన అమలు తీరును పరిశీలించి విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృంద ం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ పోల్స్



నవాబుపేట: మండల కేంద్రంలో ప్రధాన రోడ్డును డబుల్‌గా మారుస్తు రోడ్డును పూర్తి చేశారు. రోడ్డు వేస్తున్న తరుణంలో రోడ్డు మధ్యలో తొలగించాల్సిన విద్యుత్ పోల్సును మధ్యలోనే వదిలేసి, ఏడాది గడిచినా తొలగించకపోవటం విడ్డూరం. దీంతో ప్రయాణికులు రోడ్డు మధ్యలో పోల్స్ చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో ప్రమాదం మరింత పొంచి ఉంటుందని ప్రయాణికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ప్రమాదం జరగకముందే విద్యుత్ పోల్స్‌ను తొలగించాల్సిన అవసరం ఉంది.

పాలమూరులో క్రీడాకారుల సంబరాలు



కేక్ కట్ చేస్తున్న ఎన్పీ వెంకటేశ్, తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: అమెరికాలోని కాలిఫోర్నియాలో ఈనెల 10 నుంచి 17 వరకు జరిగిన ప్రపంచ క్యారమ్స్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర క్రీడాకారులు మెరుగైన ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు క్యారమ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అల్తాఫ్ అహ్మద్ ఖాన్ తెలిపారు. ఈ పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు శ్రీనివాస్, మహ్మద్ ఆరిఫ్ డబుల్స్ విభాగంలో బంగారు పతకాలు, స్విస్‌లీగ్ ఈవెంట్ ఆదిత్య రజత పతకం , హకీం కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో పతకాలు రావడంపై సంబరాలు చేసుకున్నారు. ముఖ్య అతిథిగా ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్పీ వెంకటేశ్ పాల్గొని కేక్‌కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ క్యారమ్స్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు పతకాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సమద్‌ఖాన్, డాక్టర్ బ్రిజేష్ చౌడా, డీఎస్ఏ కోచ్‌లు సునీల్‌కుమార్, పర్వేజ్‌పాష తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దామని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్ పిలుపునిచ్చారు. గురువారం ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, ఏఐటీయూసీ, టీయూసీఐ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, ఆటో యూనియన్ నాయకులు బాబుమియా, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి సుతారి తిరుమలయ్యలతో కలిసి మాట్లాడారు. కేంద్ర పాలకుల కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాల వల్ల దేశ ప్రజలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు అనేక కష్టాలు పడుతున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు, కర్షకులు, ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ హామీల వైఫల్యాలపై పోరాటం



హన్వాడలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా సభ్యత్వ కన్వీనర్ కృష్ణవర్ధన్‌రెడ్డి

హన్వాడ: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజాఉద్యమాలకు సిద్ధం కావాలని, బీజేపీ జిల్లా సభ్యత్వ కన్వీనర్ కృష్ణవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందన్నారు. అంతకుమందు సభ్యత్వ నమోదుపై ఆరా తీశారు. కారక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, జిల్లా కార్యదర్శి బుచ్చిరెడ్డి, కోశాధికారి పాండురంగారెడ్డి, నాయకులు రమణారెడ్డి, కృష్ణయ్యగౌడ్, చెన్నప్ప, లింగం పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పాలమూరు యూనివర్సిటీలో ఏబీవీపీ నాయకులు నిరసన చేపట్టారు. ఈ మేరకు యూనివర్సిటీ సెక్రటరీ శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.7,500 కోట్ల రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వం పెండింగ్ పెట్టిందని, వాటి వల్ల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికేట్లు ఇవ్వకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. యూనివర్సిటీల్లో సైతం విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ రావడం లేదని, వాటి వల్ల యూనివర్సిటీలు బలహీనంగా మారుతున్నాయన్నారు. వెంటనే వాటిని విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కృష్ణకుమార్, వేణుగోపాల్, తిరుమలేష్, విష్ణువర్ధన్, పూజిత, ప్రియాంక, అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేద్దాం



హన్వాడలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

హన్వాడ: డిసెంబర్ 1న హైదరాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించబోయే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని మాల మహానాడు ఉమ్మడి జిల్లా కో కన్వీనర్ ఎం.నర్సింహయ్య పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో మాలమహానాడు నాయకులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంతీర్పును వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లోని పరేడ్‌మైదానంలో వచ్చే నెల 1న నిర్వహించనున్న మాలల సింహగర్జనకు మాలలు అధికసంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు రమేష్, బాలకిష్టయ్య, గోపాల్, యాదయ్య, వెంకట్రాములు, చెన్నయ్య, శ్యాంసుందర్, అశోక్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



కంచన్‌పల్లిలో వడ్ల కొనుగోలు కేంద్రంను పరిశీలించిన తహసీల్దార్

హన్వాడ: మండల కేంద్రంలోని ఎఫ్‌ఏసీఎస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం రైతుసంఘం నాయకులు పరిశీలించారు. మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాల్లోనూ వరి కొనుగోలు చేయకపోవడంతో రైతులను ఇబ్బందికి గురిచేస్తున్నారని విమర్శించారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ఈ సమస్య తలెత్తుతున్నదని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి రైతుల నుంచి వరికొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి లక్ష్మయ్య, అధ్యక్షుడు నర్సింహులు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండలంలోని కంచన్‌పల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ రాజు పరిశీలించారు. కేంద్రంలో కరెంట్ సమస్యపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వీఓ జంగయ్య, ఏఈఓ, తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలకు నిప్పు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని పలు గ్రామాల్లో వరిసాగు చేసిన రైతులు పంట కోతలు పూర్తయిన నేపథ్యంలో కొందరు తమ పొలాల్లోని వరి కొయ్యలకు నిప్పు పెడుతున్నారు. పొలంలో ఉన్న గడ్డి, చెత్తను వెంటనే తొలగించాలనే ఉద్దేశంతో కొయ్యలకు నిప్పంటిస్తున్నారు. దీని వల్ల పెద్ద ఎత్తున పొగలు వెలువడి వాయు కాలుష్యం ఏర్పడుతోంది. వరి కొయ్యలకు నిప్పు పెట్టడం ద్వారా భూమి సారవంతమవుతుందనే నమ్మకంతో కొందరు రైతులు ఈ పని చేస్తున్నారు. మూసాపేట, కొమిరెడ్డిపల్లి, వేముల, పోల్కంపల్లి, నిజాలాపూర్ గ్రామాల్లో కొందరు రైతులు వరి కొయ్యలకు నిప్పు పెడుతున్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారి అనిల్‌కుమార్‌ను సంప్రదించగా నిప్పు పెట్టడం ద్వారా పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయని తెలిపారు. భూమి వేడెక్కి భూసారం కోల్పోతుందని, వాయు కాలుష్యం ఏర్పడుతుందని వివరించారు. పొగ పీల్చడం వల్ల రైతులు అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. పొలంలో ఉన్న చెత్త త్వరగా పోయేందుకు ప్రత్యామ్నాయంగా ఒక సాలు నాగలితో దున్ని నీళ్లు పెట్టిన తర్వాత 50కిలోల బస్తా సూపర్ పాస్ఫేట్ చల్లితే వారంలో అది కుళ్లిపోయి ఎరువుగా మారుతుందన్నారు. రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ పొలంలో నిప్పు పెట్టవద్దని కోరారు.